


వరాహ లక్ష్మీ నృసింహుని కల్యాణం

తాడేపల్లిరూరల్ : పొలకంపాడులోని వరాహ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ జరిగింది.



త్రికోటేశ్వరునికి మల్లెల అర్చన

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామికి బుధవారం రాత్రి మల్లెపూల అర్చనను నిర్వహించారు. వైశాఖ శుద్ధ పౌర్ణమి నాడు మల్లెలతో అర్చన ఆనవాయితీ.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 504.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

డీఫార్మసీ కోర్సులో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో రెండేళ్ల కాల పరిమితి గల డీ ఫార్మసీ కోర్సులో 2024–25 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా సీట్ల కేటాయింపునకు జూన్ 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ రెగ్యులర్‌తోపాటు దూరవిద్య ద్వారా బైపీసీ, ఎంపీసీ పూర్తి చేసిన విద్యార్థినులు, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ బోర్డు నుంచి తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. ఆదాయ ధ్రువీకరణపత్రం, తెల్ల రేషన్ కార్డు కలిగిన ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు ప్రభుత్వం ద్వారా అడ్మిషన్ ఫీజు మినహాయింపుతో పాటు ఉపకార వేతనాలకు అవకాశం ఉందని తెలిపారు. ప్రవేశం పొందిన విద్యార్థినులకు కళాశాల ప్రాంగణంలోనే హాస్టల్ వసతి ఉందని, ఆసక్తి గల విద్యార్థినులు అన్ని సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, దరఖాస్తు రుసుం రూ.400తో కళాశాలలోని ప్రిన్సిపాల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు 98480 38769, 99593 24563, 93986 20953 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ కౌంటింగ్ ఏజెంట్లను అడ్డుకునే కుట్ర

ఎమ్మెల్యే గోపిరెడ్డి చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ కాకుమాను

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ తరఫున కౌంటింగ్ ఏజెంట్లుగా ఉండే వారిని అడ్డుకోవడానికి కుట్ర జరుగుతోందని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ కాకుమాను బాలహనుమంతరెడ్డి బుధవారం వెల్లడించారు. కౌంటింగ్ ఏజెంట్ల నేర చరిత్ర పరిశీలించి సర్టిఫికెట్ చేస్తామని పోలీస్ శాఖ చెప్పడం తగదని పేర్కొన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 కింద, కేంద్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనల్లో ఎక్కడా అలాంటి రూల్ లేదని పేర్కొన్నారు. కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకునే అధికారం పార్టీలకు ఉందని స్పష్టం చేశారు. కౌంటింగ్ ఏజెంట్లకు గుర్తింపు కార్డులిచ్చే అధికారం రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఉంటుందని, ఇందులో పోలీసుల ప్రమేయమేమీ ఉండదని వివరించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన నరసరావుపేట నియోజకవర్గస్థాయి ఆల్ పార్టీ సమావేశంలోనూ ఈ ప్రశ్న లేవనెత్తానని వివరించారు.

హత్యాయత్నం కేసులో బీజేపీ పట్టణ కన్వీనర్ అరెస్ట్

పోలింగ్ రోజు దాడుల్లో అరవిందబాబుతో కలసి పాల్గొన్న రామకృష్ణ

నరసరావుపేట టౌన్: పోలింగ్ రోజు టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి దాడుల్లో పాల్గొన్న బీజేపీ పట్టణ కన్వీనర్ రంగిశెట్టి రామకృష్ణను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి బుధవారం న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా రిమాండ్ విధించారు. పోలింగ్ రోజు మున్సిపల్ బాలుర పాఠశాల ఎదుట ఏరియా వైద్యశాల వద్ద నిల్చొని ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కారు డ్రైవర్ చట్టి మహేంద్రపై అరవిందబాబు, రంగిశెట్టి రామకృష్ణ మరికొందరు మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. ఘటనలో తీవ్రంగా గాయపడ్డ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా ఎన్నికల కమిషన్ నియమించిన సిట్ బృందం నిందితులను గుర్తించింది. కేసులో రామకృష్ణను ఇప్పటికే అరెస్ట్ చేయగా పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నట్లు సీఐ కృష్ణారెడ్డి తెలిపారు.

నేటి నుంచి అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్

నరసరావుపేట: ఈనెల 23 తేదీ గురువారం పల్నాడు జిల్లాలోని అన్ని ఆరోగ్య ఉప కేంద్రాలలో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ ప్రారంభమవుతుందని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి బుధవారం పేర్కొన్నారు. 60 ఏళ్లకు పైబడిన వారు, షుగర్ వ్యాధితో బాధపడుతున్న వారు, ఐదేళ్లలోపు క్షయ వ్యాధికి గురైనన వారు, రెండేళ్ల లోపుగా క్షయ వ్యాధిగ్రస్తునితో కలిసి నివసించిన వారు, బాడీ మాస్ ఇండెక్స్ 18లోపు ఉన్నవారు, పొగతాగే అలవాటు ఉన్నవారు అడల్ట్ బీసీజీ టీకా వేయించుకోవచ్చని తెలిపారు. సమీప ఆరోగ్య కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.3,000, గరిష్ట ధర రూ.4,200, మోడల్ ధర రూ.5,100 వరకు పలికింది.

సీబీఎస్ఈ విద్యయవంతం

- ప్రభుత్వ స్కూళ్లలో బోధన
- గుంటూరు జిల్లాలో 12 పాఠశాలల్లో దిగ్విజయంగా అమలు
- వచ్చే ఏడాది మార్చిలో టెన్త్ విద్యార్థులకు బోర్డు ఎగ్జామ్స్
- 2024–25 విద్యా సంవత్సరంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు సీబీఎస్ఈ పాఠ్యాంశాల బోధన
- పాఠ్య పుస్తకాలను సిద్ధం చేసిన ప్రభుత్వం
- ముద్రణా సంస్థల నుంచి నేరుగా పాఠశాలలకే పంపిణీ
- బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ కల్పించిన ప్రభుత్వం



సీబీఎస్ఈ పాఠ్యాంశాల బోధనపై ఇటీవల గుంటూరులో జరిగిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న పాఠ్య పుస్తక విభాగ డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, డీఈవో శైలజ (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: సర్కారు బడులను ప్రైవేటు, కార్పొరేట్‌కు దీటుగా ఆధునిక వసతులతో అభివృద్ధి చేసిన ప్రభుత్వం విద్యార్థులను జాతీయస్థాయి పోటీకి అనుగుణంగా తీర్చిదిద్దుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన సీబీఎస్ఈ సిలబస్ విద్యాబోధన విజయవంతంగా జరుగుతోంది. గత విద్యాసంవత్సరంలో సీబీఎస్ఈ సిలబస్‌లో 8, 9 చదివిన విద్యార్థులు 2024–25 విద్యాసంవత్సరంలో 9,10 తరగతులకు వెళ్లనున్నారు. అదే విధంగా 7వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు 8వ తరగతిలోకి ప్రవేశించనున్నారు. ఈ విధంగా వచ్చే విద్యాసంవత్సరంలో సీబీఎస్ఈ సిలబస్‌లో 8,9,10 తరగతులకు వెళుతున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ విధంగా గుంటూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశపెట్టిన 12 పాఠశాలల్లో విద్యాబోధన విజయవంతంగా జరుగుతుండగా, ఉపాధ్యాయుల్లో వృత్తి మెలకులను పెంచేందుకు ప్రభుత్వం ఇటీవల సీబీఎస్ఈ పాఠశాలల ఉపాధ్యాయులకు ఓరియెంటేషన్ తరగతులనూ నిర్వహించింది. 8,9 తరగతుల విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో విద్యాబోధన అందించడంతోపాటుగా 10వ తరగతిలో మారిన పాఠ్యాంశాల బోధనపై సబ్జెక్టు నిపుణులతో ఆధునిక పద్ధతులతో శిక్షణ కల్పించారు. వచ్చే విద్యా సంవత్సరంలో 10వ తరగతిలోకి ప్రవేశిస్తున్న విద్యార్థులు 2025 మార్చిలో సీబీఎస్ఈ బోర్డు దేశ వ్యాప్తంగా నిర్వహించే టెన్త్ బోర్డు పరీక్షలకు హాజరవుతారు. స్టేట్ సిలబస్‌కు సమాంతరంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రవేశపెట్టిన సీబీఎస్ఈ సిలబస్‌లో బోధన ద్వారా విద్యార్థులను జాతీయస్థాయిలో నిర్వహించే ఐఐటీ–జేఈఈ, నీట్ పరీక్షలకు సన్నద్ధమయ్యే విధంగా అత్యుత్తమ బోధన అందిస్తున్న ప్రభుత్వం.. నాణ్యమైన పాఠ్యాంశాలతో ఆకర్షణీయమైన రీతిలో పాఠ్య పుస్తకాలను ముద్రించి, ఉచితంగా పంపిణీ చేస్తోంది. 8,9,10 తరగతులకు పాఠ్య పుస్తకాలను సిద్ధం చేసిన ప్రభుత్వం వాటిని పాఠశాలలు తెరిచే లోపు ముద్రణా సంస్థల నుంచి నేరుగా పాఠశాలలకే పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టింది.



ఇటీవల గుంటూరులో జరిగిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు (ఫైల్)

2024–25లో జిల్లాలోని సీబీఎస్ఈ పాఠశాలల్లో 8,9,10 తరగతుల వారీగా ప్రవేశించనున్న విద్యార్థులు ఇలా..

తరగతి	విద్యార్థుల సంఖ్య
8వ తరగతి	1,131
9వ తరగతి	1,122
10వ తరగతి	1,156

జాతీయస్థాయిలో పోటీకి దీటుగా..

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమల్లో ఉన్న సీబీఎస్ఈ సిలబస్ బోధన జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విజయవంతంగా అమలు జరుగుతోంది. జాతీయస్థాయిలో పోటీని తట్టుకుని రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. నూతన సిలబస్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలనూ పూర్తి చేశాం.

– పి.శైలజ, జిల్లా విద్యాశాఖాధికారి

పకడ్బందీగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ

- జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్ బాషా
- పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం
- 30న ఓట్ల లెక్కింపుపై సిబ్బందికి శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్ బాషా, పక్కన జేసీ శ్రీధర్

బాపట్ల: ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమంపై రిటర్నింగ్ అధికారులు, ఏఆర్ఓలకు బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, సమర్థతతో నిర్వహించాలని చెప్పారు. ఉదయం 8 గంటలకు కల్లా ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యేలా చూడాలని అధికారుల్ని ఆయన ఆదేశించారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఓట్ల లెక్కింపు కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. ఈసీఐ సూచించిన మార్గదర్శకాల్ని విస్మరించరాదని తెలిపారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు 12 కౌంటింగ్ హాల్స్, పోస్టల్ బ్యాలెట్ కోసం మరో రెండు కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో 14 టేబుల్స్ ఏర్పాటు చేయాలని, ఒక రౌండ్‌లో 14 పోలింగ్ కేంద్రాలలోని ఓట్లు లెక్కించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లెక్కింపు కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదని హెచ్చరించారు. ఎలక్ట్రానిక్ వస్తువులు సైతం లోపలికి అనుమతించరాదన్నారు. నాలుగు రోజులు ముందుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మార్గనిర్దేశం చేశారు. విధి నిర్వహణలో పొరపాట్లు జరగకుండా అధికారులు నిఘా ఉంచాలని తెలిపారు. లెక్కింపు కేంద్రంలో గొడవలు జరిగితే కఠిన చర్యలు ఉంటాయని, కేసులు నమోదు చేస్తామనే విషయాన్ని అభ్యర్థులకు తెలపాలని చెప్పారు. ఈనెల 28వ తేదీన ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. 30న ఓట్ల లెక్కింపు సిబ్బందికి మొదటి దశ శిక్షణ, మూడో తేదీన రెండో దశ శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. దీనికి నిష్ణాతులైన మాస్టర్ ట్రైనర్లను నియమించాలని తెలిపారు. ముఖ్యంగా ఈటీపీబీఎస్, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు కార్యక్రమంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎన్నికల పరిశీలకులు, పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో పారదర్శకంగా ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

సామగ్రి సమకూర్చుకోవాలి: జేసీ

ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన సామగ్రి సమకూర్చుకోవాలని ఆర్ఓలను జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్. శ్రీధర్ ఆదేశించారు. ఈసీఐ మార్గదర్శకాలు, నిబంధనలపై పీపీటీ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, ఆర్ఓలు, ఏఆర్ఓలు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య పాల్గొన్నారు.

27న నిధి ఆప్‌కే నికట్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఈపీఎఫ్ ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 27న నిధి ఆప్‌కే నికట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు వెల్లడించారు. యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖాముఖిగా చర్చలు జరుగుతాయని తెలిపారు. గుంటూరు కృష్ణనగర్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రి, కృష్ణాజిల్లా గుడివాడ మండలం తమిరిస గ్రామంలోని ఉమా స్పింటెక్స్ ప్రైవేటు లిమిటెడ్, ఒంగోలులోని ఈఎస్ఈసీ బ్రాంచ్, విజయవాడ గాంధీనగర్‌లోని ఈఎస్ఈసీ బ్రాంచ్ కార్యాలయం, బాపట్ల జిల్లా కారంచేడులోని శ్రీసాయి ఎడ్యుకేషనల్ సొసైటీ, పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం తిమ్మాపురంలోని వసంత ఇండస్ట్రీస్‌లో జరిగే కార్యక్రమాల్లో ఫిర్యాదులు, సమస్యల్ని అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

27 నుంచి మార్టూరులో నాటిక పోటీలు



వివరాలు వెల్లడిస్తున్న కందిమళ్ల సాంబశివరావు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నాటిక పోటీల్ని 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్నట్లు శ్రీకారం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అన్నారు. స్థానిక ఎఫర్ట్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 14వ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీల్ని శ్రీకారం స్వచ్ఛంద సంస్థ, మార్టూరు రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 11 నాటికల్ని ప్రదర్శన కోసం ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. మార్టూరు పరిసర మండలాల కళాకారులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. విజేతలకు రోటరీ జిల్లా పీస్ కమిటీ చైర్మన్ కె. విక్రమ్ రెడ్డి, శ్రీమతి వైజయంతి విక్రమ్ రెడ్డి చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేయనున్నట్లు సాంబశివరావు తెలిపారు. కార్యక్రమంలో ఎఫర్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జె.వి.మోహనరావు, మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు తాళ్లూరి సాంబశివరావు, మద్దుమాల కోటేశ్వరరావు, రోటరీ క్లబ్ ప్రతినిధులు ఇంటూరి ఆంజనేయులు, శానంపూడి లక్ష్మయ్య, దొడ్డా రమేష్, ఆజా హుస్సేన్, శ్రీకారం సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోటీలలో ప్రదర్శించనున్న నాటికలు

27వ తేదీ: రాత్రి 8: 30 గంటలకు శ్రీ అమృత లహరి ఆర్ట్స్ విజయవాడవారి 'నాన్నా! నేను వచ్చేస్తా' నాటిక, రాత్రి 10 గంటలకు తెలుగు కళా సమితి విశాఖవారి ' నిశ్శబ్దమా... నీ ఖరీదెంత?' నాటిక, రాత్రి 11 గంటలకు కళానికేతన్ వీరన్నపాలెం వారి 'రాజుగారి గోచి' ప్రదర్శిస్తారు.

28వ తేదీ : రాత్రి 8: 30 గంటలకు శ్రీకారం, రోటరీ కళాపరిషత్ మార్టూరు వారి ' రైతు భారతం' నాటిక, రాత్రి 10: 30 గంటలకు రసఝరి పొన్నూరి నాటిక 'కాపలా' 11: 30 గంటలకు కళాంజలి హైదరాబాదు వారి' రైతే రాజు' 12: 30 గంటలకు మైత్రి కళానిలయం విజయవాడ వారి 'బంధం' నాటిక ప్రదర్శిస్తారు.

29వ తేదీ : రాత్రి 8: 30 గంటలకు అభినయ గుంటూరి వారి 'ఇంద్రప్రస్థం', 10: 30 గంటలకు చైతన్య కళాభారతి కరీంనగర్ వారి 'చీకటి పువ్వు నాటిక', 11: 30 గంటలకు శ్రీ సాయి ఆర్ట్స్ పాలకలూరు వారి 'కౌసల్యా సుప్రజా రామ', 12: 30 గంటలకు వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారి 'రాత' నాటికలు ప్రదర్శించనున్నారు.

నేడు భావదేవుడి రథోత్సవం

- తిరునాళ్లకు ఆలయం ముస్తాబు
- ఏర్పాట్లలో అధికారుల నిమగ్నం



భావదేవుడి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు (ఫైల్)

బాపట్ల: అత్యంత ప్రసిద్ధి చెందిన పురాతన ఆలయాల్లో ఒకటైన బాపట్ల క్షీరభావన్నారాయణ స్వామి రథోత్సవం గురువారం సాయంత్రం 3.51 గంటలకు అత్యంత వైభవంగా జరగనుంది. అధికారులు కూడా 1,431వ రథోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు చేశారు. క్రీ.శ 596లో నిర్మించినబడిన క్షీర భావన్నారాయణ స్వామి దేవాలయం కారణంగానే ఈ పట్టణానికి తొలుత భావపురి అని...కాలక్రమేణా బాపట్లగా మారినట్లు తెలుస్తోంది. అంతటి ప్రసిద్ధి చెందిన ఈ ఆలయం తిరునాళ్ల మహోత్సవం అత్యంత వైభవంగా, కమనీయంగా జరుగుతుంది. ఈ సందర్భంగా జరిగే రథోత్సవాన్ని తిలకించేందుకు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ, మున్సిపల్, పోలీస్‌శాఖ, ఎలక్ట్రికల్ శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీభావదేవుల కల్యాణ మహోత్సవం, శ్రీ పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం, కొండపాటూరు అమ్మవారి శాశ్వత అక్షతారోపణ ఉభయదాతలుగా సాగింది. భక్తులు స్వామిని పూజించి మొక్కులు తీర్చుకున్నారు.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పటిష్ఠ భద్రత

రథోత్సవానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా పట్టణ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది పటిష్ఠ భద్రత చర్యలు చేపడుతున్నారు. తిరునాళ్లలో దొంగతనాలకు పాల్పడే వారిపై సీసీ కెమెరాలతో పాటు, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. బుధవారం సాయంత్రం నుంచి బాపట్ల–సూర్యలంక రహదారి మూసివేయనున్నట్లు చెప్పారు. వాహనాలను భీమావారిపాలెం, పోలేరమ్మ గుడి ప్రాంతాల మీదుగా తరలిస్తామని తెలిపారు. రథోత్సవంలో తోపులాట లేకుండా భక్తులు స్వామిని ప్రశాంతంగా దర్శించుకోవాలని ఆయన సూచించారు.

మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు

తిరునాళ్లలో భాగంగా ఆలయానికి, రథోత్సవానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా మున్సిపల్ శాఖ ఏర్పాటు చేస్తోంది. ఆలయ ప్రాంగణం నుంచి ఆంజనేయస్వామి దేవాలయం వరకు మధ్య తాగు నీరు ఏర్పాటు చేశారు. ఎక్కడా పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు.

టెన్త్, ఇంటర్ అడ్వాన్స్‌డ్

సప్లిమెంటరీకి సర్వంసిద్ధం

- రేపటి నుంచి పరీక్షలు
- ఎస్ఎస్ఎస్సీ, ఇంటర్ బోర్డు సైట్లలో హాల్ టికెట్లు
- టెన్త్ పరీక్షలకు హాజరు కానున్న 6,373 మంది
- ఇంటర్ పరీక్షలకు 17,776 మంది
- పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల 24 శుక్రవారం నుంచి జరగనున్న 10వ తరగతి, ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాకుండా అధికారులు పరీక్ష కేంద్రాల్లో కట్టుదిట్ట వసతులు కల్పించారు. టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల హాల్ టికెట్లను డీజీఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్‌తో పాటు ఇంటర్ హాల్ టికెట్లను బీఐఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్లలో అందుబాటులో ఉంచారు. వాటిని విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకుని, నేరుగా పరీక్షలకు హాజరు కావచ్చు.

టెన్త్ పరీక్షలకు 27 పరీక్ష కేంద్రాలు

ఈనెల 24 నుంచి జూన్ 3 వరకు జరగనున్న 10వ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు గుంటూరు జిల్లా వ్యాప్తంగా 6,373 మంది విద్యార్థులు హాజరు కానుండగా, 27 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల విధులకు 27 మంది చొప్పున చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులు సహా 280 మంది ఇన్విజిలేటర్లను విద్యాశాఖాధికారులు నియమించారు.

ఇంటర్‌కు 36 పరీక్ష కేంద్రాలు

ఈనెల 24 నుంచి జరగనున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు గుంటూరు జిల్లా వ్యాప్తంగా 17,776 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. జిల్లా వ్యాప్తంగా 36 పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న ప్రథమ సంవత్సర సప్లిమెంటరీ పరీక్షలకు ఫెయిలైన వారితో పాటు బెటర్‌మెంట్ రాస్తున్న విద్యార్థులను కలుపుకుని 15,291 మంది హాజరు కానున్నారు. అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరగనున్న ద్వితీయ సంవత్సర పరీక్షలకు 2,485 మంది హాజరు కానున్నారు.



మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది



ఆందోళనకారులను నియంత్రిస్తున్న ప్రత్యేక దళాలు

భద్రతా చర్యలపై మాక్‌డ్రిల్



ఆందోళనకారులను వాటర్ కెనాన్‌తో అడ్డుకునే దృశ్యం

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమం సమీపిస్తున్న తరుణంలో పోలీసులు భద్రతా చర్యలపై దృష్టి సారించారు. ఈ క్రమంలో బుధవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఈస్ట్ సబ్‌డివిజన్ ఏఎస్పీ నిచికేత్ షలేకే, లా అండ్ ఆర్డర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శాంతకుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలు ఆర్టీసీ బస్టాండ్ వద్ద 'మాబ్ ఆపరేషన్' మాక్ డ్రిల్ నిర్వహించాయి. ఏదైనా అనుకోని ఘటన జరిగిన నేపథ్యంలో, హింసాత్మక చర్యలకు పాల్పడినప్పుడు ఎలా స్పందించాలనే అంశాలపై సిబ్బంది విన్యాసాలు చేశారు. లాఠీచార్జి, వాటర్ కెనాన్ ప్రయోగం, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్, ఫైరింగ్‌పై డెమో నిర్వహించారు. జాగిలాలతో విన్యాసాలు చేయించారు. శాంతిభద్రతల రక్షణలో భాగంగా మాక్ డ్రిల్ నిర్వహించామని, కౌంటింగ్ సందర్భంగా ఏదైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే నియంత్రించేందుకు ప్రత్యేక బృందాలను నియమించామని పోలీసు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ మనోజ్ హెగ్డే, కొత్తపేట, పాత గుంటూరు సీఐలు షేక్ అన్వర్‌బాషా, రమేష్‌బాబు, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ బి.కోటేశ్వరరావు,ఆర్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి ఉపాధ్యాయుడి మృతి



యద్దనపూడి: బైక్ అదుపుతప్పి ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన యద్దనపూడి, పోలూరు గ్రామాల మధ్య బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పోలూరు గ్రామానికి చెందిన తాళ్లూరి వినోద్‌కుమార్ (36) దర్శి ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. బుధవారం ఉదయం స్వగ్రామం పోలూరుకు బైక్‌పై వస్తుండగా అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ఘటనలో వినోద్‌కుమార్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్ఐ జీవీ చౌదరి సంఘటనా స్థలికి చేరుకొని కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారత సినిమాకు రెడ్ కార్పెట్



తెనాలి అర్బన్: ఫ్రాన్స్ దేశంలో జరుగుతున్న కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారతీయ సినిమాకు రెడ్ కార్పెట్ వేయడం భారత పౌరులు గర్వించదగిన విషయమని మా ఏపీ వ్యవస్థాపకులు, సినీ దర్శకులు దిలీప్‌రాజా పేర్కొన్నారు. తెనాలిలోని రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా చలన చిత్ర నైపుణ్యాల ప్రదర్శనలో ప్రసిద్ధి చెందిన కేన్స్‌లోని అంతర్జాతీయ వేదికపై భారత చిత్రాలకు గౌరవం లభించడంపై ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ముస్తాజుబుద్దీన్ మాలిక్ దర్శకత్వంలో రూపొందిన గాడ్ మస్ట్ బి డై చిత్రంలో సాక్షాత్తు దేవుడిని చంపడం ఊహించలేని కథాంశంగా పేర్కొంటూ ప్రపంచ వ్యాప్తంగా చర్చకు దారితీసిందంటే హాలీవుడ్ స్థాయికి భారతీయ సినిమా ఎదిగిందనటంలో ఎటువంటి సందేహం లేదన్నారు. సినిమాలో హీరోగా నటించిన సందీప్ కర్తార్ సింగ్‌కు కేన్స్‌లో రెడ్ కార్పెట్ వేయడం మర్చిపోలేని అనుభూతిగా అభివర్ణించారు. మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ తీర్మానం చేసినట్లు ప్రకటించారు. సమావేశంలో మా ఏపీ సంయుక్త కార్యదర్శి మిలిటరీ ప్రసాద్, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటీవ్ మునిపల్లె శ్రీకాంత్, నటుడు బెల్లంకొండ వెంకట్, మన్నె సత్యనారాయణ చౌదరి, ఇంటూరి విజయభాస్కర్, వెంకీ రావణ్ పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో కార్డన్ సెర్చ్

- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్
- ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు
- ప్రజలు సంయమనంతో వ్యవహరించాలి

బాపట్ల టౌన్: నేర నియంత్రణే లక్ష్యంగా కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లాలోని సమస్యాత్మక గ్రామాల్లో బుధవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ రోజున అనంతరం జిల్లాలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలలో భాగంగా సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు.

- బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో, బాపట్ల రూరల్ ఇన్‌స్పెక్టర్ వై.శ్రీహరి, బాపట్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ యు.శ్రీనివాసులు, బాపట్ల రూరల్ సీఐ బి.హజరత్‌బాబు ఏపీఎస్పీ బలగాలతో బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల ఘర్షణలు చోటు చేసుకున్న వెస్ట్ పిన్నిబోయినవారిపాలెంలో తనిఖీలు చేశారు.



వెస్ట్ పిన్నిబోయినవారిపాలెంలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

- చీరాల టూ టౌన్ సీఐ కె.సోమశేఖర్ ఆధ్వర్యంలో స్టేషన్ పోలీస్ సిబ్బంది, ఏపీఎస్పీ బలగాలతో ఇటీవల ఘర్షణలు చోటుచేసుకున్న శృంగారపేటలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు.
- చీరాల నియోజకవర్గం వేటపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని జబ్బర్ కాలనీ, అద్దంకి పోలీస్ స్టేషన్ పరిధిలోని కలవకూరులో పోలీస్ అధికారులు, సిబ్బంది తనిఖీలు చేశారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

జిల్లా ఎస్పీ మలికా గార్గ్

రెంటచింతల: జిల్లాలోని సమస్యాత్మకమైన గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ అన్నారు. మంగళవారం మండలంలోని పాలువాయిగేటు, తుమ్మకోట గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆమె సందర్శించి పరిశీలించారు. ఆయా గ్రామాలలో ఈవీఎంలు ధ్వంసమైన ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మలికా గార్గ్ అక్కడ ఏర్పాటు చేసిన పికెట్‌లోని పోలీస్ సిబ్బందికి బందోబస్తుకు సంబంధించి పలు సూచనలు చేశారు. జూన్ 4న కౌటింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం ఎక్కడా అల్లర్లు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. హింసాత్మక ఘటనలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



పాలువాయిగేటు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పరిశీలిస్తున్న పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్

పలు ప్రాంతాల్లో పోలీసుల కార్డెన్ సెర్చ్

సత్తెనపల్లి: జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణంలోని రాజుల కాలనీ, చెంచు కాలనీల్లో పట్టణ పోలీసులు బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గృహాలు, పాడుబడిన ఇళ్లు, పాకలలో విస్తృతంగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పాత నేరస్తులు, అనుమానితులు, స్థానికేతర్ల కదలికలపై ఆరా తీశారు. తనిఖీల సందర్భంగా సరైన పత్రాలు లేని రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని పట్టణ పోలీస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ జూన్ 4వ తేదీన కౌంటింగ్ సందర్భంగా అల్లర్లకు ఆస్కారం ఉంటుందనే సూచనల నేపథ్యంలో కార్డెన్ సెర్చ్ చేపట్టినట్లు తెలిపారు. ఆయనతో పాటు పట్టణ ఎస్ఐలు ఎం.సంధ్యారాణి, ఎం.సత్యనారాయణ, పోలీసులు, మహిళా పోలీసులు ఉన్నారు.



సత్తెనపల్లి చెంచుకాలనీలో సీఐ శ్రీనివాసరావు, పోలీసుల తనిఖీలు

పాత గణేశునిపాడులో..

పిడుగురాళ్ల రూరల్: జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు మండలంలోని పాతగణేశునిపాడు గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు తెలిపారు. గ్రామంలో ప్రతి ఇంటిని ముమ్మరంగా తనిఖీ చేశామన్నారు. నెంబర్ ప్లేట్ లేని, సరైన రికార్డులు లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్, ఏఎస్ఐలు కొండలరావు, ప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పాత గణేశునిపాడులో స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

కంటైనర్‌ను ఢీకొన్న ట్యాంకర్

- ట్యాంకర్ క్యాబిన్‌కు అంటుకున్న మంటలు
- డ్రైవర్ సజీవ దహనం

మేదరమెట్ల: ఆగి ఉన్న కంటైనర్‌ను వెనుక నుంచి ట్యాంకర్ బలంగా ఢీకొన్న సంఘటనలో డ్రైవర్ మంటల్లో చిక్కుకొని సజీవ దహనమైన సంఘటన కొరిశపాడు మండలం మేదరమెట్ల పైలాన్‌పై మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. కృష్ణపట్నం పోర్టు నుంచి పేరేచర్లలో గల జోసిల్ సోప్స్ కంపెనీకి సోప్ ఆయిల్ లోడుతో ట్యాంకర్ బయలుదేరింది. మేదరమెట్ల పైలాన్ వద్దకు రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో దానిపై నిలిపి ఉన్న కంటైనర్‌ను వెనుక నుంచి బలంగా ఢీ కొట్టాడు. దీంతో ట్యాంకర్ క్యాబిన్‌కు ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో నిద్రమత్తులో ఉన్న డ్రైవర్ అందులోనే సజీవదహనమయ్యాడు. మృతుడు పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొవ్వూరు మండలం ఇనమనమడుగు గ్రామానికి చెందిన కొట్లూరి శ్రీధర్ (40)గా పోలీసులు గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మేదరమెట్ల ఇన్‌చార్జి ఎస్ఐ తిరుపతిరావు తెలిపారు.



మంటల్లో కాలిపోతున్న ట్యాంకర్



శ్రీధర్ (ఫైల్)

పాముకాటుతో కౌలు రైతు మృతి

బల్లికురవ: పొలం నుంచి పశువుల మేత కోసుకుని వస్తుండగా పాము కాటు వేయడంతో కౌలు రైతు మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి మండలంలోని కొప్పరపాడు సుగాలి తండాలో జరిగింది. తండా వాసులు, పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. భూక్యా రమేష్ నాయక్ (44) తండాకు దక్షిణ భాగంలో 99 సెంట్ల పొలాన్ని కౌలుకు తీసుకున్నాడు. అందులో బెండ, పశుగ్రాసం సాగు చేపట్టాడు. సాయంత్రం బెండతోటకు మందుకొట్టి, పశువులకు మేత కోసుకుని ఇంటికి వస్తున్నాడు. చీకట్లో రోడ్డుకు అడ్డుగా పడుకున్న పామును పొరపాటున తొక్కడంతో కాటు వేసింది. ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశాడు. హుటాహుటిన చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. ఈలోపే రమేష్ నాయక్ మృతి చెందాడు. అతడికి భార్య దేవి బాయి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. బుధవారం తండ్రి కోటా నాయక్ బల్లికురవ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఏఎస్ఐ బండి శ్రీనివాసరావు కేసు నమోదు చేసుకున్నారు. అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. అందరితో కలివిడిగా ఉండే రమేష్ నాయక్ పాముకాటుతో చనిపోవడంతో తండాలో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.



రమేష్ నాయక్

కార్నియా ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్ విజయవంతం

చెరుకుపల్లి: మండలంలోని గూడవల్లిలో ఉన్న కేవీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్, డాక్టర్ కొమ్మారెడ్డి రాజా రామ్మోహనరావు ఐ హాస్పిటల్‌లో బుధవారం నిర్వహించిన కార్నియా ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్ (నల్లగుడ్డు మార్పిడి) విజయవంతం అయినట్లు వైద్య బృందం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. డాక్టర్ అరవిందరామ్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్రేయాచంద్ర, డాక్టర్ బన్సీ సింఘాలా బృందం ఆపరేషన్‌ను విజయవంతంగా చేసినట్లు పేర్కొంది. వీరికి వైద్యశాల డాక్టర్ బృందం వీరవల్లి వాసుబాబు, ఎస్.పిచ్చిరెడ్డి, ఎం.రవిచంద్ర, వై.వెంకట్, ఎస్.రంజిత్ కృతజ్ఞతలు తెలిపారు.



కార్నియా ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్ చేస్తున్న వైద్య బృందం

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా జేసీ, నియోజకవర్గ ఆర్ఓ శ్యాం ప్రసాద్

మాచర్ల రూరల్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం జూన్ 4న జరగనున్న కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాం ప్రసాద్ తెలిపారు. బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సరావుపేట జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ క్యాంపస్‌లో ఉదయం 8గంటలకు కౌటింగ్ ప్రారంభమవుతుందని, మొదటగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరుగుతుందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల లెక్కింపు వేర్వేరు చోట్ల 14 టేబుళ్లలో జరుగుతుందన్నారు. సంబంధిత పార్టీ అభ్యర్థులు 15 మంది ఏజెంట్లకు అనుమతి ఇవ్వనున్నట్లు చెప్పారు. కౌంటింగ్‌కు వచ్చేవారు సెల్‌ఫోన్, ఇతర నిషేధిత వస్తువులు తీసుకురాకూడదన్నారు. స్ట్రాంగ్ రూం అభ్యర్థుల, ప్రతినిధుల సమక్షంలో ఓపెన్ చేసి కౌంటింగ్‌ను ప్రారంభిస్తామని చెప్పారు. తహసీల్దార్ మంజునాథరెడ్డి, డెప్యూటీ తహసీశీల్దార్ షేక్ బాషా, వైఎస్సార్ సీపీ నియోజక వర్గ బూత్‌ల కన్వీనర్ కుర్రా వెంకటేశ్వరరావు, పలు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ శ్యాం ప్రసాద్

రైల్వే స్టేషన్లలో బైక్‌ల దొంగ అరెస్ట్

- నాలుగు బైక్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన రైల్వే జీఆర్పీ పోలీసుల

లక్ష్మీపురం: రైల్వే స్టేషన్‌లలో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న యువకుడిని గుంటూరు పశ్చిమ పరిధిలో జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. గుంటూరు రైల్వే స్టేషన్ పరిధిలోని రైల్వే ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆదేశాల మేరకు గుంటూరు రైల్వే జీఆర్పీ డీఎస్పీ నాగేశ్వరరావు పర్యవేక్షణలో బుధవారం సాయంత్రం జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్ఐలు రమేష్, వెంకటాద్రి, ఖాదర్ బాషా గుంటూరు పశ్చిమ పరిధిలోని తనిఖీలు చేశారు. ఈ సమయంలో ఓ యువకుడు పోలీసులను చూసి పరారయ్యే ప్రయత్నం చేశాడు. అతడి వెంటపడి పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఆ యువకుడు గుంటూరు స్తంభాలగరువు ప్రాంతానికి చెందిన అక్కిశెట్టి ఆకాష్‌గా గుర్తించారు. చెడు వ్యసనాలను అలవాటు పడి ద్విచక్ర వాహనాలను దొంగతనం చేసి వాటిని విక్రయించగా వచ్చిన నగదుతో జల్సాలు చేస్తున్నట్లు విచారణలో అంగీకరించాడు. దీంతో అతడి వద్ద ఉన్న సుమారు రూ.2.45 లక్షల విలువ చేసే నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రయాణికులు రైల్వే స్టేషన్‌కు వచ్చిన సమయంలో ద్విచక్రవాహనాలను పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే పెట్టుకోవాలని సూచించారు.



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసులు

గడువు ముగిసిన విత్తనాలు గుర్తింపు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గడువు ముగిసిన విత్తనాలను విక్రయించే పలు దుకాణాలపై విజిలెన్స్/ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కొరడా ఝుళిపించారు. గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల ప్రకారం.. బుధవారం గుంటూరు రాజగారితోటలోని పలు విత్తన దుకాణాల్లో విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు కలిసి శారదా పరమేశ్వరి ఏజెన్సీస్, తరుణ్ హైబ్రీడ్ సీడ్స్ దుకాణాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. శారదా పరమేశ్వరి ఏజెన్సీస్‌లో గడువు ముగిసిన రూ.36 వేలు ఖరీదు చేసే హైబ్రీడ్ మిర్చి, కూరగాయల విత్తనాల (14.22 కిలోలు)ను గుర్తించారు. దీంతో విత్తనాలను సీజ్ చేసి, దుకాణ యాజమానిపై 6–ఎ కేసు నమోదు చేయాలని స్థానిక వ్యవసాయ శాఖ అధికార్ని ఆదేశించారు. తరుణ్ హైబ్రీడ్ సీడ్స్ దుకాణంలో 'సోర్స్ ధృవీకరణ పత్రం' లేకుండా ఉన్న రూ.2.58 లక్షల విలువ చేసే 2 కిలోల హైబ్రీడ్ మిరప విత్తనాలను గుర్తించారు. దీంతో విత్తన విక్రయాలను నిలుపుదల చేయాలని స్థానిక వ్యవసాయశాఖ అధికారితో నోటీసులు జారీ చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఏఓ రమణకుమార్, ఎస్ఐ ఎం.రామచంద్రయ్య, వ్యవసాయ అధికారి బి.అంజిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు

వ్యక్తి దారుణ హత్య

గుంటూరు ఈస్ట్: నడిరోడ్డుపై వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కంచర్ల దేవదానం (33) ప్రకాశం జిల్లా కురిచేడులో నివాసం ఉంటున్నాడు. ఎన్నికల సమయంలో గుంటూరు వచ్చి సంజీవయ్యనగర్ 1వ లైనులో మకాం పెట్టాడు. అతని సమీప బంధువుకు డబ్బులు అప్పుగా ఇచ్చాడు. ఈ నేపథ్యంలో దేవదానం అతడ్ని తరచూ డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. ఇద్దరి మధ్య గొడవలు చోటు చేసుకున్నాయి. సమీప బంధువు దేవదానాన్ని చంపుతానని బెదిరిస్తూ వచ్చాడు. బుధవారం దేవదానం కొందరితో కలిసి వసంతరాయపురంలోని సాయిసుధా బార్‌కు వెళ్లి మద్యం తాగారు. అందరూ కలిసి కారులో సంజీవయ్యనగర్ 2వ లైనుకు వచ్చారు. కంచర్ల దేవదానం మూత్ర విసర్జన చేయడం కోసం ఆపి కిందకు దిగాడు. మూత్ర విసర్జన అనంతరం కారులోని మిగిలిన వారు కత్తులతో దేవదానంపై దాడి చేసి హత్య చేశారు. అతడు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వెస్ట్ డీఎస్పీ మహేష్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దైవ దర్శనానికి వెళుతూ అనంతలోకాలకు..

- ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి
- మరో ఐదుగురికి గాయాలు

అచ్చంపేట: ఆటోలో దైవదర్శనానికి వెళుతూ ప్రమాదానికి గురై వ్యక్తి మృతి చెందగా మరో ఐదుగురికి గాయాలైన ఘటన మండలంలోని తాడువాయి పంచాయతీ పరిధిలోగల బొగ్గు వాగు మలుపులో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని కోనూరు గ్రామానికి చెందిన 12 మంది ఆటోలో తెలంగాణ రాష్ట్రంలోని హుజూర్‌నగర్ మండల పరిధిలోగల మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి బయలు దేరారు. అచ్చంపేట దాటి తాడువాయి సమీపంలోని బొగ్గువాగు మలుపులో అదుపుతప్పి పల్టీ కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న నడికుదురు చినవెంకటేశ్వర్లు(70)తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య చినవీరవర్ధనకు తీవ్ర గాయాలయ్యాయి వారితో పాటు వారి బంధువులు వెంకట్రావమ్మ, నాగరాజు, నాగేంద్రమ్మ, వీరకుమారిలకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు బాధితులను 108వాహనంలో సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అచ్చంపేట సీఐ షేక్ కరీముల్లాషావలి కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.



మృతుడు చినవెంకటేశ్వర్లు

బాలుడికి కృత్రిమ చేతులు



విద్యుత్ షాక్‌తో రెండు చేతులో కోల్పోయిన షమీ



రెండు కృత్రిమ చేతులు అమర్చిన అనంతరం మంగళగిరి రోటరీ క్లబ్ సభ్యులతో షమీ

తాడేపల్లిరూరల్: ఆపదలో ఉన్న స్నేహితుడిని కాపాడబోయి విద్యుదాఘాతంతో రెండు చేతులూ కోల్పోయిన బాలుడికి మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం కృత్రిమ చేతులు అమర్చారు. మరికొందరికి కృత్రిమ అవయవాలు అందించారు. మంగళగిరి రోటరీ క్లబ్ చైర్మన్‌అనిల్ చక్రవర్తి మాట్లాడుతూ సర్వీస్ ప్రాజెక్ట్ మంగళకరం 2024 జెమ్ ఎంకె1 హ్యాండ్స్, కృత్రిమ చేతుల ఉచిత పంపిణీ కార్యక్రమంలో భాగంగా జర్మనీ నుంచి వచ్చిన క్రిస్ గల్లి నిపుణుల బృందం కృత్రిమ చేతులను అమరుస్తోందని, సుమారు 300 మంది దివ్యాంగులకు కృత్రిమ చేతుల పంపిణీకి సన్నాహాలు చేశామని వివరించారు.

గాలిపటం ఎగరేస్తుండగా ప్రమాదం

తెలంగాణ రాష్ట్రం, వికారాబాద్ జిల్లా, పరిగి వివేకానంద విగ్రహం సెంటర్‌కు చెందిన మహమ్మద్ రఫీఖ్ పాషా, రేష్మా బేగంల కుమారుడు షమీ 2019 డిసెంబర్ 8న స్నేహితుడు జహీర్‌తో కలిసి ఇంటి వద్ద గాలిపటం ఎగురవేస్తున్న క్రమంలో హైటెన్షన్ వైర్‌కు చిక్కుకుంది. జహీర్ ఇనుపరాడ్డుతో గాలిపటాన్ని తీయబోయి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో షమీ అతడిని కాపాడబోయి తనూ విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఈ దుర్ఘటనలో షమీ కోమాలోకి వెళ్లి 22 రోజుల అనంతరం కోలుకున్నాడు. రెండు చేతులూ కోల్పోయాడు. దీంతో రోటరీ క్లబ్ సాయంతో చేతులు అమర్చారు.